# మనిషి • రెండు

శ్రీ వాకాటి పాండురంగరావ్

ఢిల్లీ అనే చరిత్రనుండి మధుర అనే పురాణం వైపు పరుగెత్తే రోడ్డు చాల పొడుగాటి రోడ్డు. చాల ముఖ్యమైన రోడ్డు. కొన్ని చోట్ల చాల ముచ్చటైన రోడ్డు కూడాను.

ఆ రోడ్డు మీదే 'పురానా ఖిల్లా' అనబడే పాత కోట వుంది. 'జూ' వున్నదీ ఆ రోడ్డుమీదనే. ఆకాశం నుండి చూస్తే త్రాసులా కనుపించే భవనంలో కాపురం చేసే సుప్రీంకోర్టు కాక పదకొండంతస్తుల సరికొత్త హొటలు ఉన్నది ఈ ఢిల్లీ మధురా రోడ్డుమీదే.

రకరకాల చెట్లు ఇరువైపులా బారులు తీరిచి నిలిచి జోహారులర్పిస్తుండగా - నల్లగా, నలభై యడుగుల నడుముగల నీగ్రో సుందరిలా పరుగెత్తే మధుర రోడ్డు మరి గర్వపడుతుందంటే పడదూ!

పదకొండంతస్తుల హొటలు దాటిన తర్వాత మధుర రోడ్డు అడ్డంగా ఒక ఆకుపచ్చటి ద్వీపం వున్నది.

అక్కడ — 'తినగ తినగ తియ్యన'వుతుం దంటారే ఆ బాపతు వేపచెట్లూ, వేసవి మాసాలలో దేవత లెవరో పెళ్ళిపీటంపై కూచుని బంగారు ముత్యాలను తలంబ్రాలు పోసుకుంటున్నట్లు గుత్తులు గుత్తులుగా పసుప్పచ్చటి పువ్వులను వర్షించే 'సోనా'ల చెట్లూ కలిసి కంటికి కమ్మగా విందు చేస్తాయి.

ఆ ద్వీపం మధ్యగా — చరిత్రకు సాక్ష్యలుగా ఢిల్లీ యంతటా నిలిచివుండే శతకోటి సమాధులలో ఒక్కటి — నెత్తిమీద గుండ్రటి టోపీ పెట్టుకున్నది, తుప్పు పట్టిన దానిలా వున్నా అక్కడక్కడ పచ్చగా నీలంగా మెరుస్తున్నది — వున్నది.

ఆ ద్వీపం నిలిచి వున్నచోట మధురారోడ్డునుండి ఎడమవైపుకు ఒక్క మట్టిబాట బయలుదేరుతుంది. ఆ బాట ఓ అర ఫర్లాంగు దూరం వెళ్ళి హుమాయూన్ సమాధి దగ్గర ఆగిపోతుంది. నిత్యమూ పొద్దునపూట యాత్రికుల బస్సు వచ్చి వెళ్లేచోటు అది. మిగతా వేళల జనసంచారం అంతగా వుండనిచోటు అది.

మధురారోడ్డునుండి ఆ మట్టిబాట పుట్టే చోట మధురా రోడ్‌కు ఎడమవైపుగా, మట్టిబాటకు కుడివైపుగా ఒక పెట్రోలు బంక్ వుంది.

ఎనిమిదేళ్ళనాడు, ఇంకా ఆ ప్రాంతం ఒక మోస్తరు అరణ్యంగా వున్ననాడు, ఆ మట్టి బాటకు ఎడమవైపుగా వున్న చెట్ల మధ్యగా వెళ్ళి కూచున్నాడు ముకుందం.

అతడు కూచున్న చోటినుండి ఎదుటికి చూస్తే నలభై యడుగుల దూరాన మట్టిబాట, దాని కవతల పెట్రోలు బంక్ వున్నాయి, ప్రక్కకు చూస్తే దాదాపు పదిగజాల దూరాన చెట్ల సందులోనుంచి మధురా రోడ్డు మీద అపుడపుడు దూసుకు పోతున్నకార్లు కనపడుతున్నాయి.

అపుడు సాయంకాలం ఆరుంబావు అవుతూంది. సూర్యుడు అస్తమించవలసిన సమయమే కాని అది జూలై మాసం అవడంచేత ఇంకా సూర్యుడు, ఔరంగజేబులా వెలుగుతూ వున్నాడు.

ఆ వెలుగులో కూచున్నాడు ముకుందం.

ముకుందం చాల, విచిత్రమైన మనిషి. బుద్ధుడికీ మార్క్స్‌కూ గల సామ్యాన్ని చర్చించడం అతగాడి హాబీ. అతడు చాలాకాలం నేషనలిస్టు, కొంతకాలం కమ్యూనిస్టు, ప్రస్తుతం ఉద్యోగాన్వేషనిస్టు. మరీ ఏకటాకీన ఏ మూడు నాలుగు రోజులో పస్తుండిపోవలసివచ్చిన సందర్భాలలో ముకుందం గేయాలూ గట్రా రాయడమూ కద్దు.

అతడి మిత్రుడు శశిధర్ నాట్యాచార్యుడు. సంపద ఎంతోవుండి, సంస్కృతిని కొనడానికని తిరుగుతుండే ఆడవాళ్ళొకరిద్దరు శశిధర్‌కు తెలుసు. ఆ స్నేహాల ధర్మమా అని శశిధర్ కళ విహరించడానికి కొత్త రంగం దొరికింది. అతడు సంగీత రూపకాలను ప్రదర్శించడం మొదలు పెట్టాడు. ముకుందానికి ఏదో నాలుగు డబ్బులు ముట్టజెపుదామన్న ఉద్దేశంతో తాను తయారుచేసిన "శివ లీల" అన్న సంగీత రూపకానికి బలవంతాన ముకుందం చేత నాలుగు పాటలు రాయించాడు. ఆ పాటలు ప్రజలను

విపరీతంగా ఆకర్షించడం చూచి అందరికన్నా ఎక్కువగా ఆశ్చర్యపడిన వ్యక్తి ముకుందమే!

అరెరె, ఇదేదో మనకే తెలియకుండా మనలోపల ఓ శక్తి వున్నట్లుందే—అని ఆశ్చర్యపోయాడు ముకుందం.

ఆ మరు సంవత్సరం శశిధర్ నెహ్రూ రాసిన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' సంగీత రూపకంగా ప్రదర్శించ సంకల్పించాడు. దానికి పాటలు రాయమని ముకుందానికి చెప్పాడు.

అంతకు ముందుసారయితే శశిధర్ రాయమని అడగగానే రాసిచ్చేశాడు ముకుందం. కాని ఈ సారి తాను కొంత పేరు పొందిన కవి గనుక అంత సులభంగా రాసేయకూడదనుకున్నాడు ముకుందం. ఏవో కొన్ని ఉన్నత ప్రమాణాలు నిర్ణయించుకుందాం --అనుకున్నాడు. మూడ్ కావాలన్నాడు. ఇన్స్పిరేషన్ రావాలన్నాడు అలంకారాలు అమరడం లేదన్నాడు ధ్వనిలో లోపం వినపడుతూంది అన్నాడు. మొత్తంమీద అయిదింట మూడు పాటలు రాయడానికి నెలకు పైగా టైము తీసుకున్నాడు ముకుందం.

ఆ వేళ శశిధర్ వాళ్ల నటీనట వర్గమంతా హుమాయూన్ సమాధి కివతల ఓ అరమైలు దూరంలో ఒక ఇంట్లో రిహార్సల్‌కని మధ్యాహ్నమే వచ్చారు. వాళ్ల రిహార్సల్స్‌ని చూస్తూ, అక్కడొక్కటి ఇక్కడొక్కటిగా వాళ్ల ఉచ్చారణనూ, నటననూ దిద్దుతూ - వాళ్లు తన పాటలు పాడుతున్నప్పుడు ప్రత్యేకంగా కనుబొమలు ముడిచి చూస్తూ —వాళ్ల సంగీతానికి మెరుగులు దిద్దుతూ వున్న ముకుందానికి లోలోపల నవ్వు వచ్చింది

'ఏమోయ్ ముకుందం, ఏవి టీ నాటకం అంతా? ఆఁ? ఆ అమ్మాయి ఆ పంక్తిని ఇట్లా పాడితేనేం, అట్లా పాడిలేనేం —ఏదో సూపర్‌ఫైన్ డిఫరెన్స్ లఫోరించినట్లూ, అదేదో నీ కళా హృదయానికే తెలిసినట్లుగా దిద్దుతున్నావే! ....కట్టిపెట్టవోయ్ మిడతంబొట్లూ—' అని లోలోపల నుండి పరిహాసం విన్పిస్తే వినీ విననట్లూరుకున్నాడు ముకుందం

ఒక సోగకన్నుల చిన్నది, విష్ణుప్రియ అన్నది, తన పాత్రను అభినయించి చూపి 'డైరెక్టర్ సాబ్' అంటూ శశిధర్ అభిప్రాయంకోసం చూడగా, శశి ముకుందాన్ని చూశాడు. ముకుందం విష్ణుప్రియ వైపు చూచి — 'అచ్ఛే, బొత్తిగా లాభం లేదు' అన్నట్లు పెదవి విరిచాడు.

'ఏదో మహా తెలిసి ఏడిచినట్లుగా పెదవి విరిచేస్తున్నావుగాని ఒరేయ్, ఆ మాత్రం భావాన్ని నువ్వు తెప్పించు నీ పిడక మొహంమీద—' అంటున్న తనలోని ప్రతిధ్వని ఇంకెవరికీ వినపడలేదుకదా అని కలయజూశాడు ముకుందం.

అయిదు పాటేంది రిహార్సల్ జోరుగా సాగుతూంది. ముకుందం అనుకున్నాడు — ఇట్లాగే, ఈ మొహాలకు రంగులు పూసుకునే కుర్రసంత ఎదుట అస్తమానం కూలబడి పోతే సుప్రసిద్ధ వాగ్గేయకారకుడయిన బి వి ముకుందం మానవుడిలా కన్పించేస్తాడేమో— కవి అన్నవాడు కాని, రచయిత అన్నవాడు కాని ఇతరులకన్న భిన్నంగా వుండాలి.

భిన్నంగా అంటే ఎట్లాగా?

జుత్తు దువ్వకపోవడం—
చొక్కాకు బొత్తాలు పెట్టుకోకపోవడం—
డబ్బులున్నా బీడీలు కాల్చడం—
చెప్పులు లేకుండా తిరగడం—
ఎప్పుడూ దూరంగా దేనివైపో చూస్తూండడం .....

.... అబ్బబ్బ, ఇట్లాటివి చేయడం నాకు నచ్చదు అని అంతకు ముందెన్నోసార్లు అనుకున్న ముకుందం— ఆ వేళ ముకుందం— ది — గ్రేట్‌రైటర్ పాత్ర నభినయించా లనుకున్నాడు రిహార్సల్ మాంచి, రసవత్తరమైన ఘట్టంలో వుండగా దానిని తదేకంగా తిలకిస్తున్న శశిధర్ దగ్గరకు వెళ్లి "శశీ... బుర్రలో ఏవో అయిడియాలు కదులుతున్నాయి.... నేనలా వెళ్తా" నన్నాడు.

తల ఊచాడు శశి.

నడిచాడు ముకుందం. నడిచి నడిచి హుమాయూన్ సమాధి దగ్గరకు వెళ్లి పుట్టిబాటకు ప్రక్కగా, ఆ బాటకు దూరంగా, పొదల ఒడిలో కూలబడ్డాడు. కోటు జేబు లోంచి దినపత్రిక చుట్టిన పొట్లం తీశాడు. ఆ పత్రికను విప్పి, దానిమధ్య వున్న బిర్ బాటిల్‌ను తీసి అందులో మిగిలి వున్న కొద్ది 'బీరు'నూ 'ముకుందార్పణం' అంటూ గొంతులో పోసుకున్నాడు.

ఆ బాటిల్‌ని చేత్తో పట్టుకున్నాడు.

నవ్వొచ్చింది ముకుందానికి.

నవ్వాడు పెద్దగా.

బాటిల్‌ని మెడ దగ్గర, భామామణిని నడుం దగ్గర పట్టుకో— అన్నాడు ఎవడో ఒక ఇంగ్లీషువాడు.

మరి ఆ భామామణి తను కాపురం వుంటున్న ఇల్లుగలాయన యొక్క పెళ్లాలయిన సర్దారిణిలా వుంటే ·

నదరు నడుముకు చాంతాడు చుట్టీకదా లాగవలె! ... పూర్ ఇంగ్లీష్‌మాన్! సామెతలు పలికే ముందుగా సర్దారిణుల గాంచుము; లోకజ్ఞానము బడయుము — అనుకున్నాడు ముకుందం.

అందుకనే నవ్వుకున్నాడు.

ఇంకా వెలుతురుంది కాని ఎక్కడో కుయ్యోమని తోడేలు అరుపులాటిది వినిపించింది ముకుందానికి. బలం కొద్దీ ఆ బీర్ బాటిల్‌ని విసిరేశాడు. దూరంగా వెళ్లి 'ఢఢ్' మన్న చప్పుడుతో పడింది ఆ బాటిల్. ఆ చప్పుడుకు బెదరిన పావురాల జంట రెపరెపమంటూ లేచింది. బౌలర్ ముకుందం ప్రావీణ్యం చూసి కవి ముకుందానికి ముచ్చ టేసింది.

గడ్డిమీద రుమాలు పరచి వెల్లకిలా పడుకున్నాడు ముకుందం.

ఆకాశం — అతడిని వంగి ముద్దుపెట్టుకోవడానికి యత్నిస్తున్న తల్లిలా కన్పించింది.

ఓరి వెర్రినాగన్నా — నువ్వేదో కళ అని, ఆరాధన అని, కవిత్వం అని, విజ్ఞానం అనీ బొంకుతుంటావే — చూడు — ఇటు చూడవోయ్ — బాగా చూడు — నీ కళ్లు అంటుంటావే, అవి చాలేమో చూడు! చూచి చెప్పు ఏమం టావో దీన్ని — అందం అంటావా — ఆనందం అంటావా — అనుభూతి అంటావా — ఛందస్సంటావా — బ్లాంక్ వెర్సంటావా — నీవంటి గడ్డిపోచల మెదడులకు అందలేని మహావిచిత్రం అంటావా — ఏమంటావురా అబ్బీ — అని నిలవేసి అడుగుతున్నట్లుంది ఆకాశం. తల విదిలించు కుంటూ లేచిన ముకుందానికి హఠాత్తుగా — తానున్న చోటికీ — తనకు నలభై అడుగుల దూరంలోవున్న మట్టి బాటకు మధ్య, కాస్త ఎడంవైపుగా ఆ చెట్లవరుసమధ్యగా ఇద్దరు నిల్చున్నట్లు కనుపించారు.

ముకుందంలోని పత్తేదారు వెయ్యికళ్లతో పరి కించసాగాడు.

వాళ్ళిద్దరూ మళ్లీ కూచున్నారు. కష్టపడి చూశాడు ముకుందం. ఒక్కరున్నట్లే కనుపించింది.

అదేవిటి, ఇందాక తాను స్పష్టంగా ఇద్దరినిచూస్తే ..

మరి కాసేపు తర్వాత వాళ్లు లేచి నిలబడ్డారు.

ఆ... నే చెప్పలేదూ ... ఒక్కరు కాదయ్యా మహా నుభావా, ఇద్దరూ — ఒకటి ప్లస్ ఒకటి — అని చెప్ప లేదూ — అని ఒకరు తాను చెప్పుకుంటున్న ముకుం దానికి, ఆ ఇద్దరూ ఒక్కరు కావడం కనుపించింది.

ఓరి నీ తస్సాదియ్యా — అవేమీ దెయ్యాలూ భూతాలూ కావయ్యా స్వామీ. .... వాళ్లిద్దరూ ఆడా మగా, ఆడం అండ్ ఈవ్, ప్రకృతీ పురుషుడూ, పుష్పమూ, భ్రమరమూ...వగైరా వగైరావోయ్ నాటుకవీ—అని చెప్పాడు అంతర్ముకుందుడు.

ఐస్సీ! ఐస్సీ! అనుకుని చూడకూడదనుకుంటూనె చాల జాగ్రత్తగా చూశాడు ముకుందం.

ఆ అబ్బాయీ అమ్మాయీ గాఢంగా మళ్లీ ఒక్క సారి కౌగలించుకుని ముద్దుపెట్టుకున్నారు.

ముకుందం పెదవులను ఆరడి నాలుక ముద్దు పెట్టుకొంది

చీకటి పడుతూంది. వాళ్లిదరూ నెమ్మదిగా అడు గులు వేశారు. మట్టి బాటను సమీపించారు.

కాని అరెరె . .. ...

ఏమిటిది .... వాళ్లు మళ్లీ వస్తున్నారే .... ఇటే వస్తున్నా రేమిటే . కొంపదీసి దారి దోపిడి దొంగల జంట కాదుకద . అయితే బాబోయ్, తన్ను చితకపొడిచేయ గలరు... కేకవేసినా పలకడానికి ఎవరూ లేరు. ఆ రిపో ర్టులు కూడా ఈ పాటికి అయ్యిపోయుంటుంది.

అయినా ముకుందం! నీకు నువ్వెంత ప్రాధాన్యం ఎందు కిచ్చుకుంటావోయ్ ... నువ్వేమన్నా పెద్ద సినిమా స్టారునా లేక కోటీశ్వరుడి ఒక్కగా నొక్క కొడుకువా, నిన్ను దొంగలు ఎత్తుకుపోయి ఏ యాభై వేలో ఇస్తేగాని వదలి పెట్టము — అని ప్రకటించడానికి! లేపోతే నీమీద ఏమన్నా నవరత్నఖచితమైన పతకాలా, దరాలా వెలిగి పోతున్నాయా వాళ్లు దోచుకోవడానికి అందువలన ఓ ముకుందమా, భయపడకుమా —

వగైరా డైలాగుని తనలోంచే వింటున్న ముకుం దానికి ఆ మసక చీకటి వెలుతురులో, వాళ్లిద్దరూ ఒకే చోట నిలబడ్డారు కాస్సేపుండి అటూఇటూ తచ్చాడ సాగారు.

ఓప్పో! ఇదేదో కుర్రకరు ప్రణయంలాగుందిస్మీ! ... ఆ ఆడకూతురు 'పద మధూ పద' అంటూంది కాబోలు, 'నిలు సుధా నిలు' అంటున్నాడు కాబోలు హీరో కుర్రవాడు. విడవలేక, విడవలేక మథనపడుతూ, బాధపడుతూ ఆ ప్రేమికులిద్దరూ—

ఒరేయ్ ముకుందం! వెధవతినెధవా! వాళ్ల గొడవేదో వాళ్లు పడతారుగాని నువ్విలా లజ్జా పాడూ లేకుండా అటుచూడ్డం ఏమిటోయ్ ... తప్పుకదూ ... మళ్లీ నలుగురి మధ్య వున్నప్పుడు — బుద్ధుడు అరవిందుడు — అంటూ కవితె కట్టలు విప్పుతావే — ఒంటరిపాటున ఈ తుంటరి బుద్ధులేల — అని లోపలి ముకుందం ఘోషిస్తుండగా —

—ఆ మట్టి బాటకు అవతలవున్న పెట్రోలు బంకు తాలూకు నాలుగు రెక్కల ఎనిమిది ఫ్లోరసెంట్ దీపాలు వెండిపళ్లల్లా వెరిగిపోతూ పంచి పెడుతూన్న నకిలీ వెన్నెల కష్టంగా ఆ ప్రకృతి పురుషుల శాల్తీలు సిల్హౌటులై కనుపించాయి ముకుందానికి.

—కాళ్లు కాలిన పిల్లుల వలె

—బెల్లం కొట్టిన రాళ్లవలె

—తేలు కుట్టిన దొంగల వలె

వాళ్లిద్దరూ అక్కడే నిలబడుతున్నారు, అక్కడే అటూ ఇటూ తిరుగుతున్నారు.

ఎందుకు?

ఎందు కెందు కెందు కెందుకూ?

ముకుందం నెత్తిమీద ఎవరో చరిచినట్లయింది.

ఆరి చవటా! ఆరి ఠంరా! ఓరి జడుడా! హోరి మూఢా! .... వాళ్లేదో వెతుకుకుంటున్నారోయ్.. వెతుక్కుంటున్నారు.. .. మరే, అన్వేషించుచున్నారు .. .. గవేషించుచు ..... నీ పిండాకూడింపుచు......

వెళ్లవోయ్ వెళ్లు! వెళ్లి, పాపం, ఆ మసక వెలుతురులో ఆ కుర్రకుంక లిద్దరూ ఏం వెతుక్కుంటున్నారో కనుక్కుని వాళ్లకు కాస్త సాయంచేయి, ఫో!... !.

సాయంకాలపు ఆనందామృతంలోని విషపు బొట్టు లాంటి ఈ వెతుకులాటను అంతంచేసి, వాళ్లు పోగొట్టుకున్న దేవిటో చూసిపెడితివా నీ ఇవ్వాళ్టి బ్రతుక్కో సంజాయిషీ దొరుకుతుంది. ఫో ఫో.. .. ఫో... అని తరిమాడు ముకుందంలోని ముకుందం.

భయభయంగా, అయినా అభయ ఛభయంగా — 'అబ్బా, నా కేవిటి గురూ, నేను వాళ్ల నుద్ధరించడానికి వస్తున్న సిద్ధ పురుషుణ్ణి' అనుకుంటూ — నెమ్మదిగా, నిబ్బరంగా నడిచి వచ్చి వారికో పదడుగుల దూరాన వుండగా — మర్యాదకూ మరియూ అనర్థకమూ సూచనగా ఓ దగ్గు దగ్గాడు ముకుందం.

ఆ దగ్గు తన పనిని నెరవేర్చింది.

వాళ్లిద్దరూ అదిరిపడి ఇటు చూశారు. అతడిని చూసి వెర్రి మొహాలు వేశారు. ఆ మొహాలను చూచిన ముకుందం — బలి చక్రవర్తి నెత్తిమీదకు పాదమెత్తిన వామనుడిలా ఫీలయ్యాడు.

"మీ రేదో వెతుకుతున్నట్లున్నారు?" అన్నాడు — అది ప్రశ్న కాదన్నట్లు, అది ఏమయితేనేం నాకేమిటన్నట్లు అదేదో నాకు చెబితే నా బుజ్జి నాయనలారా నే చూసి పెడతాగా అని వారిని బుజ్జగిస్తున్నట్లు.

అదిరా ముకుందం.. వారెవా! నీ స్వరంలో ఎంత గ్రేస్ వుందోయ్ నవాబుల జీవితంలో లాగా, ఉర్దూ పొయిట్రీలో లాగా — మోనాలిసా నవ్వులో లాగా — అంటూ ఏదో వాగుతున్నాడు ముకుందం లోపలి వ్యక్తి.

"అబ్బే! ఏమీ లేదండీ .. మా ఆవిడదీ చెవి దుద్దు పడిపోయిందండీ ..." అని విధిలేక చెబుతున్నట్లుగా చెప్పాడు ఆ కుర్రవాడు.

సర్వజ్ఞుడివలె తల పంకించాడు ముకుందుడు.

ఇంకాస్త తికమకపడి, తబ్బిబ్బుపడి, ఎంగిలిమింగి దగ్గి చెప్పాడు ... "కాస్సేపు ఇక్కడ కూచున్నాము... లేచి, అదిగో, ఆ బంక్ దాక వెళ్లేసరికి ఈమె కనుక్కుంది కుడిచెవి దుద్దు పడిపోయినట్లు ..... అప్పటినుండీ వెతుకుతున్నాం కానీ......" ఆ యువకుడి స్వరంలో జీర వినిపించింది.

"అది ఆయన నాకు పుట్టిన రోజుకు కొనిపెట్టారండీ . నా ప్రాణంతో సమానంగా చూచుకుంటున్నా..." అంది ఆ యువతి, ఆ మామూలు మాటలలోకి తన బాధనంతా పిండడానికి ప్రయత్నిస్తున్నట్లు.

"క్షణక్షణానికీ తగ్గిపోతున్న ఈ వెలుతురులో ఎట్లా కనపడుతుందీ ..." అన్న ఆ మగాడి గొంతులో ఏడుపే వినిపించింది

ఆమె కళ్లను చూద్దామని ప్రయత్నించిన ముకుందానికి — తన కోటు జేబులో ఎప్పుడూ వుండే పెన్సిలు టార్చి గుర్తు కొచ్చింది.

"ఆ ... మరే... ఇదిగోనండోయ్... నా దగ్గర టార్చి వుంది..." అని దానిని జేబునుండి తీసి అతడి చేతికిచ్చిన ముకుందం కొంత పెరిగాడు. టార్చి వెలుతురులో ఆమె కళ్లు రెండు టార్చిలవలె వెలగడం చూచిన ముకుందం మరి కాస్త పెరిగాడు.

చాల థాంక్సండీ!'' అని అతడు టార్చి ఇటూ అటూ తిప్పుతూ వెతకసాగాడు, అతడి వెంటనే ఆమె కూడా తిరగసాగింది.

చెప్పవోయ్ చెప్పు, ఇందాక వాళ్ళిద్దరూ గాఢంగా కౌగలించుకున్నప్పుడు నువ్వు చూడలేదూ. ... ఇదిగో ఎడమ వైపు ఈ పొద పక్కనేగా — అప్పుడా అబ్బాయి ఒడిలోకి ఈ అమ్మాయి వాలిపోతే అతడామెను ముద్దుపెట్టుకోవడాన్ని కళ్ళు పెంచిప్పల్లా చేసుకు చూడలేదూ? ఆ జవ్వని లేవబోతే ఆమె బుగ్గలను రెండు చేతుల మధ్య పట్టుకుని ఆ అబ్బాయి ఆమెను తనవైపు లాక్కోవడాన్ని ఒళ్ళంతా బైనాకులర్సుగా చేసుకుని చూడలేదూ ... మరయితే అప్పుడా, అదిగో ఆ కానుగ చెట్టుందే దాని కివతల, ఇదిగో ఈ పొద దగ్గరే ఎక్కడో పడివుండాలి ఆ అమ్మాయి దుద్దు ఆ చోటు విడిచి లేచి వెళ్ళిన వాళ్ళు, తాము కూర్చున్న చోటును గుర్తించలేక ఇటు ప్రక్కగా వెతుకుతున్నారు ఇటుకాదు అటు, అని చెప్పు. ... .. లేకపోతే నువ్వు చూడు. ...

తన లోపలి వాడితో 'సైలెన్స్ ప్లీజ్' అని చెప్తున్నట్లుగా ముకుందం ఓ ఇగ్గు దగ్గి, —''ఆ టార్చి నిటు తెండి, నాకంటికేమైనా కనపడుతుందేమో చూద్దాం'' —అని, మరి కాస్త పెరిగినవాడై, టార్చిధరుడై రంగంలోకి దిగాడు ముకుందం. వెనువెంటనే ఆ పొద ప్రక్కగా రైటువేసి ఆ దుద్దుని కనిపెడితే, వాళ్ళిద్దరి ఏకాంతాన్ని చాటుగా పొంచి చూసిన తన దొంగతనం బయటపడుతుందేమోనని, కాసేపు కావాలని కీలకస్థానాన్ని ఇటూ అటూ టార్చి వెలుతురుని ప్రసరింపచేసి — 'చాల్లేవోయ్ నాటకం... రెండు నిముషాల నుంది, చాల్లే' అని లోపలి డైరెక్టరువారు ఆదేశించగానే — హఠాత్తుగా ఆ పొద ప్రక్కగా గడ్డిరేకుండావున్న చోటుని తన చేతి దీపపు వెలుతురుకు ఎరగా చేస్తూ — ఆ వెలుతురులో, తాను ఎదురు చూసినట్లు మిలమిలమని మెరిసిన ఆ చిన్నరాయిలాటి దానిని తడెకంగా సాక్షాత్తూ భగవంతుడిలా చూస్తూ —''అదిగో, ఇదో దుద్దు -'' అన్నాడు.

భళరా బాలగోపాలా భళీ! — అన్నాడు అసలు ముకుందం.

ఒక్క ఊపులో గద్దలా ఎగిరివెళ్ళి, వంగి, ఆ రవ్వల దుద్దుని చేత్తో తీసుకున్నాడు ఆ యువకుడు.



''ఏ నిజం — గామండీ - ఎలాగై రుట్నా... ఏమీమండీరు ..'' అంటూ వాళ్ళిద్దరూ కలిసి ఒక్కసారిగా ఆనందంతో నిండిపోయి తనకు కృతజ్ఞతలు చెపుతుండడం కలగాపులగంగా వినపడుతుండగా — నిష్కామ యోగిలా తల ఆడిస్తూ ఆ నలభై అడుగులను దాటి వచ్చాడు ముకుందం అతడి వెంట జంటకవుల్లా కృతజ్ఞతల కవితలు గానం చేస్తూ వచ్చా రాదంపతులు...

అటు మథురా రోడ్‌మీది దీపాల వెలుగు, ఇటు పెట్రోలుబంక్ బాపతు వెన్నెల కాక ఏదో, మరేదో దివ్య తేజంతో మెరిసిపోతున్న ముకుందపు వదనాన్ని చూచి ఆ అమ్మాయీ అబ్బాయీ ఓ నిముషం అలా నిలబడిపోయ్యారు.

''మాకింత ఎనలేని సాయంచేసిన మీరెవరో మాకు చెప్పరూ —'' అని అడిగా డా యువకుడు.

ఒక వైపు ... అబ్బే, అదెందుకులెండి అన్నట్లు మొహంపెడుతూనే ..... ''నాపేరు బి. జి. ముకుందం — అండీ'' అని చెప్పుకున్నాడు బాలగోపాల ముకుందం.

నాటకాలపక్షి అయిన అపడుచు నొసలుముడుచుకుంది ఒక క్షణం; మరుక్షణం ఉన్నట్లుండి అరిచినంత పని చేసింది — ''ఏమన్నారూ, బి. జి. ముకుందమా.... అంటే బాలగోపాల ముకుందం కాదుకద, లాస్టియర్ 'శివలీల' లోని ఆ అద్భుతమైన పాటల్ని రాసిన ముకుందం కాదు గద ... ..''

అవునమ్మా — వాడే వీడు — పాంచకడీ దేవుడు —ముకుందాంతర్గత ముకుందుడు — అన్నట్లుగా మిలియన్ డాలర్ల దరహాసాన్ని మొహంమీద వెలిగించి, తల ఊచిన ముకుందం ఇంకా ఇంకా పెరిగి మేఘాలను దాటాడు.

కలయో — వైష్ణవమాయయో — ఫిలిమ్స్ట్రిప్ ఫొటోగ్రఫీయో —!! ఏకంగా - సజీవంగా — ప్రత్యక్షంగా ఒకానొక రచయితను కలుసుకోవడమే!! అంతలోనూ ఆ అతిలోక పురుషుడు, తనకు ప్రియాతిప్రియమైన రవ్వల దుద్దుని వెతికి ఇచ్చి నాలుగడుగుల దూరాన నిల్చుని వుండడమే!! .... ఏమి తన అదృష్టం! ఆ అమ్మాయి ఉత్సాహం పట్టలేక ముకుందం దగ్గరగా వచ్చి నిల్చుని అతడి కటిమీద చేయి వేసింది.

జాలిగా, లీలగా, హేలగా, ఒరిజినల్ ముకుందు డీలా — తన కానుకుని నిల్చునివున్న ఆ తన్నీని చూచిన ముకుందం చూపు అరక్షణంలో బెదరి, చెదరి, అడుగు దూరాన నిలబడివున్న ఆ అబ్బాయిపైకి, అతడి జబ్బ పైకి జరిగింది.

'పొడవు ఆరడుగులు

జబ్బ పరిధి కనీసం ఏడహారంగుళాలు' అన్నాడు మెదడులోని టెయిలర్.

చటుక్కున ఆ అమ్మాయికి దూరంగా తొలిగాడు ముకుందం.

కాని ఆమె కళ్లల్లోని ఆశ్చర్యమూ, ఆరాధనా భావమూ ఆవంతయినా తగ్గలేదు

అతడు ఏదో తతమతపడి జేబులలోకి చేతులు పోనిచ్చి, వాటిని బయటకు తీసి, దోసిలినిండా పదులూ ఐదులుగా ఏవేవో రూపాయల నోట్లను తీసుకుని "అయ్యా— ఇదేమి అసభ్యత అని ఏవగించుకోకండి ." మీరు నిజంగా మా కెంతటి సాయం చేశారో చెప్పలేము మేము..... మీ ఋణాన్ని ఎట్లా తీర్చుకోవాలో తెలియడం లేదు..... మీరిందులో మీ ఇష్టం వచ్చినన్ని తీసుకుంటే మా మనసుకు తృప్తి -" అంటూ పరమేశ్వరుడి పేదార విందాల వద్ద పత్రమూ తోయమూ వుంచిన భక్తుడిలా నిలబడ్డాడు.

ఆ భక్తుడితో — "అబ్బే, డబ్బెందుకండీ నాకు! ఇట్సాల్‌రైట్!" అన్న ముకుందం ఇంతగా, ఇంతింతగా పెరగగా అతడి తలతో నక్షత్రాలు ఆడుకున్నాయి.

ఆ విరాట్పురుషుడి ఎదుట చిన్న పురుగుల్లా ఫీల యిన ఆ దంపతు లిద్దరూ మళ్లీ కాస్సేపు కృతజ్ఞతలు చెప్పి, చెప్పి, మళ్లీ ఓసారి చెప్పి, ఆఖరుసారి చెప్పి— చివ రకు —అతడినుండి సెలవు తీసుకుని నెమ్మదిగా నడిచి మదురా రోడ్డు మీదకు వెళ్ళిపోయారు.

తన శరీరమూ, మనసూ భరించలేనంత ఉదాత్త భావాన్ని, సాకాల్మా లోక కల్యాణానికై అవతరించిన భగవానుడు తానన్న నిండుదనాన్ని, అణిచి పెట్టుకోలేని ముకుందం నడవలేక నడిచి, గడ్డిలోకి నడిచి కూచున్నాడు.

వాళ్లిద్దరూ అదిగో, పూర్ కీచర్స్, నిలబడివున్నారు. టాక్సీని కాబోలు పిలుస్తున్నట్లున్నారు ..

అయిదారు నిముషాలు గడిచాయి.

అంత ఉదాత్తభావమూ కర్పూరంలా వెలిగి, ఆరి పోగా, అంతటి నిండుదనమూ నిలకడలేక ఒలికిపోగా .. ముకుందం అనే మనిషికి దహం వేస్తున్నట్లు అన్పిం చింది

జేబులు తడుముకుంటే, బీర్ బాటిలు ఇందాకే పారేసిన విషయం గుర్తుకొచ్చింది. జేబులన్నీ వెతకగా వెతకగా వెరసి అర్ధరూపాయ కూడా పోగవలేదు.

ఓరి జడ్డి వెధవా! ఇందాక అట్లా పోజులకు పోకుండా, ఇంచక్కా ఓ అయిదు రూపాయలనోటు పుచ్చు కుని వుంటే ఓ బాటిలు బీర్‌కు పనికి వచ్చేది కదరా—" అని లోపలి వాడన్న మాటకు తల వూపిన ముకుందం

—ఠామ్మున తరిగి

—నక్షత్రాలనుండి విరిగి

—మట్టి మీద కారిగి

వంకరగా, టింకరగా, అసహ్యంగా ప్రాకపోగాడు నత్తగుల్లలా.